క్లుప్తంగా

రిటర్నింగ్ అధికారిని కలిసిన ట్రైనీ కలెక్టర్



రిటర్నింగ్ అధికారిని కలిసిన ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి

కర్నూలు (టౌన్) : ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి నగరపాలక సంస్థలో కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజను శుక్రవారం కలిసి పూలమొక్క అందజేశారు. విధుల్లో భాగంగా ఆమె రిటర్నింగ్ అధికారిని కలిశారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి తదితర విషయాలపై చర్చించారు.

నేడు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతుండటం వల్ల ఈ నెల 20న కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ఓల్డ్ టౌన్ సెక్షన్ పరిధిలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఏరియా, గీతా మందిర్ ప్రాంతం, దండిగేరి, ఉస్మానియా కళాశాల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు శుక్రవారం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా 11 కేవీ దీపక్ తేజా, రోజా, సాయిబాబ, బుధవారపేట పీడర్ల పరిధిలోని ధర్మాపేట, నెహ్రూనగర్, రోజ స్ట్రీట్,చల్లా కాంపౌండు, ప్రకాశ్‌నగర్, శ్రీనివాస్ నగర్, సంకల్‌బాగ్, ఎన్ఆర్ పేట, కొత్తపేట రైతుబజార్ ఏరియా, జిల్లా కోర్టు ఏరియా, చెట్టుకింద బడి, డాక్టర్ గోపిచంద్ డీటీఆర్, హబీబ్ ముబారక్ నగర్, ముఖద్వారం, మారెమ్మ టెంపుల్, బంగి అనంతయ్య స్ట్రీట్, విరూపాక్షయ్య తోట, కల్లుపెంట ఏరియాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.

22న ధరిత్రి దినోత్సవం

కర్నూలు కల్చరల్: మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ధరిత్రి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు లయన్స్ ఆడిషన్ క్యాబినెట్ సెక్రటరీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కార్యాలయంలో కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, ఎస్వీ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై వ్యాసరచన, చిత్ర లేఖనం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారందరూ పోటీలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 93968 61306 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.


ప్రజల పక్షాన పోరాటం

కల్లూరు: తాము ప్రజల పక్షాన వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఇండియా కూటమి పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గౌస్ దేశాయ్ అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని కల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. గౌస్‌దేశాయ్‌కు మద్దతుగా శరీన్‌నగర్, కల్లూరు ప్రాంతాల్లో విద్యార్థి యువజన కార్మిక సంఘాల కార్యకర్తలు, ప్రజానాట్యమండలి సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రెండో రోజు 6 నామినేషన్లు

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసేందుకు శుక్రవారం రెండో రోజు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ వేసిన వారిలో ఎస్. నజీర్ అహమ్మద్ (ఇండిపెండెంట్) హరీష్‌కు మార్ రెడ్డి (సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) ఎం. శ్రీహర్ష (ఇండిపెండెంట్) ఎస్. ఇంతియాజ్ బాషా (ఇండిపె ండెంట్), అరుణకుమార్ గిరిపోగు (బహుజన్ సమాజ్ పార్టీ) ఖలీల్ అహమ్మద్ షేక్ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) ఉన్నారు. ఇప్పటి వరకు కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి మొత్తం 9 మంది నామినేషన్లు సమర్పించారు.

ఘనంగా ఎస్వీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక నగర పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీశ్రేణులకు పంచిపెట్టారు. కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఎస్వీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షాజహాన్ పర్వీన్, జుబేర్, 3 వ వార్డు పార్టీ ఇంచార్జీ ఖాదర్ బాషా, పార్టీ మహిళా నాయకులు సుచరిత, జమిలా పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళ్తున్న సతీష్, చిత్రంలో కోట్లహర్ష, మణిగాంధీ, కొత్తకోట ప్రకాష్‌రెడ్డి

అట్టహాసంగా...

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ నామినేషన్ దాఖలు
- తొలుత తల్లిదండ్రులు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లు
- తర్వాత వైఎస్సార్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ
- తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు
- హాజరైన కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల హరిచక్రపాణి రెడ్డి
- మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

కర్నూలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డా.ఆదిమూలపు సతీష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఉదయం సతీష్ తన ఇంటి దగ్గర తల్లిదండ్రులు జార్జ్, థెరిస్సామ్మ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పాత బస్టాండ్ దగ్గర ఉన్న డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం.మణిగాంధీ, నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డితో కలిసి పూల మాలలు వేశారు. అనంతరం భారీగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ సర్కిల్ (ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్) నుంచి ర్యాలీగా నామినేషన్ వేసేందుకు కర్నూలు ఆర్‌డీఓ ఆఫీస్‌కు బయలుదేరారు. పార్కు దగ్గర అభ్యర్థి సతీమణి డాక్టర్ స్టెల్లా సతీష్ గుమ్మడి కాయతో దిష్టి తీశారు. తర్వాత ఆదిమూలపు సతీష్, వైస్సార్‌సీపీ ముఖ్య నేతలు ప్రత్యేక వాహనం ఎక్కి అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. కార్యకర్తలు ఈలలు, కేరింతల నడుమ చిన్న పార్కు, మహావీర్ సర్కిల్, ఎక్సైజ్ ఆఫీస్ మీదుగా పాత కంట్రోల్ రూమ్ వరకు, అక్కడి నుంచి గౌలిగేరి మీదుగా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బారీకేడ్ల నుంచి నామినేషన్ వేసేందుకు అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో పాటు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి, అభ్యర్థి భార్య డాక్టర్ స్టెల్లా సతీష్, అభ్యర్థికి ప్రతిపాదించే వారితో కోడుమూరు నియోజకవర్గ (కర్నూలు ఆర్‌డీఓ ఆఫీస్) రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆర్ఓ ఎం.శేషి రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.



కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

ఎన్నికల్లో ఆశీర్వదించండి...

కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్యకు ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని డాక్టర్ ఆదిమూలపు సతీష్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యే సీటు ఇచ్చారన్నారు. అందరి సహకారంతో ఎన్నికల్లో విజయ సాధిస్తానని చెప్పారు. ఒక డాక్టర్‌గా నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గంలో వరుసగా మూడోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన జెడ్పీటీసీలు రఘునాథ్ రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ఆయా విభాగాలకు చెందిన నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మరణాల సంఖ్య తగ్గించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల మరణాలు తగ్గించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలోని న్యూ లెక్చర్ హాల్‌లో ఆసుపత్రిలో జరిగిన మరణాలపై వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైనకాలజీ విభాగంలో ఇటీవల జరిగిన మరణాల గురించి సమీక్ష చేశారు. ఇందుకు సంబంధించి వైద్యులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గత నెల 6వ యూనిట్‌లో మరణించిన గద్వాలకు చెందిన సునిత అనే రోగి గురించి సమగ్ర విశ్లేషణ చేశారు. ఆమె మృతికి గల కారణాలు, అందించిన చికిత్స, నిర్వహించిన వైద్యపరీక్షల గురించి చర్చించారు. రోగుల మరణాల విషయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని చెప్పారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి డ్రగ్ స్టోర్ నుంచి తెప్పించుకోవాలని హెచ్ఓడీలను ఆదేశించారు. సమావేశంలో హెచ్ఓడీలు డాక్టర్ విజయానంద్ బాబు, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సునిల్‌కుమార్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యంలో ఓటింగ్ శాతం పెంపుపై దృష్టి

- వరుసగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహణ
- విలేకరుల సమావేశంలో పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య



కర్నూలు(సెంట్రల్) : వచ్చే ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆరు పోలింగ్ స్టేషన్ల లోకేషన్ల మార్పు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని, అయితే ఇంతవరకు అనుమతులు రాలేదన్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం 3,488 మంది, హోం ఓటింగ్ కోసం 85 ఏళ్లు నిండిన వారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారు 169 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి కల్లూరులో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫారం–6 కింద నిర్దేశిత గడువులోపు దాదాపు 3 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని పరిశీలించి ఏప్రిల్ 25వ తేదీన జాబితాలో చేర్చుతామన్నారు. కాగా, పోస్టల్ బ్యాలెట్ కోసం ఏప్రిల్ 25వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని, ఎవరైనా సరే తమ తమ ఆర్వో కార్యాలయాల్లో ఫామ్–12 ఇచ్చి బ్యాలెట్ తీసుకోవచ్చన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నియోజకవర్గంలో 299 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టనున్నట్లు వెల్లడించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

కర్నూలు కల్చరల్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో సీతారాముల వారి రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ స్వామివార్ల ఉత్సవ మూర్తులను దివ్య మంగళ రథంపై రాంబొట్ల ఆలయం నుంచి పరిసర వీధుల్లో ఊరేగించా రు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తరించారుం ఆల య పాలక మండలి చైర్మన్ నగరూరి దీప్తి, ఈఓ దినేష్, కా ర్పొరేటర్ నగరూరి శ్రీనివాస్,ఆలయ అర్చకులు గిరిశ ర్మ, కృష్ణకాంత్ కమిటీ సభ్యులు మల్లేష్,పెద్దయ్య పాల్గొన్నారు.



రథంపై ఉత్సవ మూర్తులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం జాతీయస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 15 జతల ఎద్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు శ్రీరెడ్డి చిన్నారెడ్డి తెలిపారు. పసుపుల, రుద్రవరం గ్రామాలకు చెందిన ఎల్లగౌడు వృషభాలు నిర్ణీత సమయానికి 4,103 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిగా రూ.50 వేలు దక్కించుకున్నాయి. అలాగే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ వృషభాలు 3,900 అడుగులు లాగి రెండో బహుమతిగా రూ.40 వేలు దక్కించుకున్నాయి. కలుగొట్ల రమేష్ నాయుడు, జమ్మిచెట్టు వెంకటేష్ (విడి జత) వృషభాలు 3,600 లాగి మూడో బహుమతిగా రూ.30 వేలు గెలుచుకున్నాయి. అలాగే పసుపుల, రుద్రవరం గ్రామాలకు చెందిన గోపాల్ గౌడ్, పంచలింగాలకు చెందిన షబ్బీర్ (విడి జత) వృషభాలు 3,326 అడుగులు లాగి నాల్గో బహుమతిగా రూ.25 వేలు, ఐదో స్థానంలో వెంకటగిరి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి వృషభాలు రూ.20 వేలు, ఆరో స్థానంలో జెక్కిలేరు రషీద్ బాషా వృషభాలు రూ.15 వేలు దక్కించుకున్నాయి. పోటీలను మాజీ సర్పంచ్ శ్రీరెడ్డి చెన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కురువ నాగరాజు, జేసీబీ అంజి, శివాంజనేయులు, లక్ష్మీదేవమ్మ, పెద్ద నాగమద్దయ్య, రాశిక శివాంజనేయులు పాల్గొన్నారు.

పిన్నాపురంలో పోటీలు ప్రారంభం

పాణ్యం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. పాణ్యం మాజీ జెట్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి పోటీలను ప్రారంభించారు. పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వృషభాలను తీసుకొచ్చారు. పోటీలను తిలకించేందు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హోరాహోరీగా పోటీలు సాగాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లకృష్ణయ్య, నాయకులు సత్యాలు, రమణ, వెంకట, చందమామ బాబు, కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు వెళ్దాం

- మరోసారి జగనన్నను గెలిపించుకుందాం
- బూత్ కమిటీల సమావేశంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్





6వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ. పార్టీ కార్యాలయంలో సమావేశానికి హాజరైన బూత్ కమిటీల నాయకులు

కర్నూలు (టౌన్) : 'ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ఈ కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేద్దాం. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గడపకు వెళ్దాం. వైఎస్ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధిని వివరించి ఓటు అడుగుదా'మని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ బూత్ కమిటీలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ నగర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి బూత్ కమిటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. ఎన్నికలు దగ్గర పడటంతో నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ కమిటీలు అప్రమత్తంగా ఉండి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కోర్ కమిటీల సమన్వయంతో ఓటర్లను కలవాలన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రెండు సార్లు విజయం సాధించిందన్నారు. బూత్ కమిటీలు, కోర్‌కమిటీలు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు స్థానిక నాయకులు అందరం కలిసి కట్టుగా పనిచేసి మూడోసారి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించుకుందామన్నారు.

100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. 43 వ వార్డుకు చెందిన పార్టీ ఇన్‌చార్జ్ సాతర్ల రాజేష్ బాబు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమం అందించాడని చెప్పారు. అవినీతికి తావు లేకుండా వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వంటింటి మహిళలకు ఈ ప్రభుత్వం పథకాల వర్తింపులో పెద్దపీట వేసిందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు ఎలాంటి మంచి చేయని చంద్రబాబు మళ్లీ ఓట్ల కోసం వద్దకు వస్తున్నారని బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అక్కడికక్కడే సమస్య పరిష్కారం

నగరపాలక సంస్థ పరిధిలోని 43 వ వార్డు పంప్ హౌస్ వద్ద గూడెం కొట్టాలలో నివసించే పేదలు గత నాలుగురోజులుగా కరెంటు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో గూడెం కొట్టాల వాసులు ఇంతియాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో మీకు అండగా ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో గోశాల చైర్మన్ ఆది మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సీహెచ్. మద్దయ్య, చాట్ల నవీన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటు వేయండి

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అభ్యర్థించారు. శుక్రవారం రాత్రి నగరపాలక సంస్థ పరిధిలోని 6వ వార్డు గడ్డా వీధి, పూల బజార్ ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, స్థానిక కార్పొరేటర్ నీలోఫర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను రద్దు చేయాలని చెబుతున్న తెలుగుదేశం పార్టీని కలిసికట్టుగా ఓడిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, హకీం, కిషన్, ఖాదర్ బాషా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్‌కు నాగార్జున ఫ్యాన్స్ మద్దతు



అసెంబ్లీ అభ్యర్థిని గజమాలతో సత్కరిస్తున్న నాగార్జున ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు, అభిమానులు

కర్నూలు (టౌన్) : 'ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ చేరారు. ఇప్పుడు 100 మందికిపైగా హీరో నాగార్జున ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు, అభిమానులు పార్టీలో చేరడం శుభపరిణామమని ఆ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ నగర కార్యాలయంలో 49 వ వార్డు కార్పొరేటర్ క్రిష్ణకాంత్ రెడ్డి నాయకత్వంలో నాగార్జున ఫ్యాన్స్ పార్టీలో చేరారు. ఇంతియాజ్‌కు మద్దతు ప్రకటించి గజమాలతో సత్కరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో గోశాల చైర్మన్ ఆది మోహన్ రెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సజీవ సమాధి కలకలం

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురంలో శుక్రవారం సాయంత్రం సజీవ సమాధి వదంతులు కలకలం రేపాయి. గ్రామంలో కొన్నేళ్ల నుంచి ఓ స్వామి ఉంటున్నాడు. కొందరు ఆయన్ను ఆరాధిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి శుక్రవారం వచ్చిన కొందరు ఆయన్ను సజీవ సమాధి చేస్తున్నారని వదంతులు రావడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో వచ్చిన వారు పరారయ్యారు.

జవహర్ నవోదయలో ప్రేరణ ఉత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభయ్యాయి. విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మాట్లాడుతూ.. ప్రేరణ ఉత్సవాలకు జిల్లాలోని 66 పాఠశాలల నుంచి 52 మంది బాలురు, 66 మంది బాలికలు పాల్గొన్నట్లు చెప్పారు. విద్యార్థులకు మూడు విభాగాల్లో (డ్రాయింగ్, వ్యాసరచన, పద్యభాగం) పోటీలు నిర్వహించి 30 మందిని రెండవ రౌండ్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారి మార్కులను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

- ఓర్వకల్లు మండలంలో ఖాళీ అవుతున్న టీడీపీ

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు పెరుగుతున్నాయి. ఓర్వకల్లు మండల వ్యాప్తంగా టీడీపీ ఖాళీ అవుతుండగా వైఎస్సార్‌సీపీ గతంలో కన్నా బలపడుతోంది. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఓర్వకల్లు గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు సర్పంచ్ నాగేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, నాగలింగేశ్వర్‌రెడ్డి, కురువ పెద్దయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కురువ ఎల్లప్ప, షాషావలి, ఖాజా హుస్సేన్, పింజరి బాకర్, దండిగల అల్లబాబు (వజ్రం) కుటుంబ సభ్యులు, మొల్ల గఫూర్ మియ్య, సదక్ హుస్సేన్, మహ్మద్ హుస్సేన్, సిలార్, పెద్ద చిరంజీవి, చిన్న చిరంజీవి, దుబ్బ స్వాములు, ప్లంబర్ కృష్ణ, భాస్కర్, వడ్డె నాగేశ్వరరావు, బోయ మధు, హోటల్ వలి, మజీద్, గౌండ ఖలీల్, ఇమ్మామ్ హుస్సేన్, మహమ్మద్ రఫీ, ఆటో ప్రతాప్‌తో పాటు 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా హామీ ఇచ్చారంటే తప్పకుండా చేస్తారని తెలిపారు. పార్టీలు, కులమతాలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అందుకే ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రాజమోహన్‌రెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి అనిల్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే కాటసాని

లొద్దిపల్లె గ్రామం నుంచి 50 కుటుంబాలు

లొద్దిపల్లె గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామ సర్పంచ్ పుష్పమ్మ, ఎంపీటీసీ నాగశిరీష, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, రాజేశ్వర రెడ్డి, వీరాభద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో నారాయణరెడ్డి, లింగన్న, నారాయణ, నడిపి స్వాములు, రఘు, పి.రాముడు, సుంకన్న, కిషోర్, యోహాను, జేమ్స్ ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు.